

"డా.ప్రకాష్ ఫిజీషియన్".

బోర్డు చదివి మెల్లగా లోపలికి అడుగుపెట్టాడు వాసు. లోపల జనం ఎవరూ లేరు. డాక్టరు ఏదో మేగజైన్ తిరగేస్తున్నాడు.

"మే ఐ కమిన్"

"యస్: కమిన్! సిడౌన్! వాటీజ్ ద మేటర్?" డాక్టర్ కుతూహలంగా అడిగాడు చేతిలోని పుస్తకం పక్కన పడేసి.

వాసు కాసేపు తటపటాయించాడు. చివరకు చెప్పాడు.

"నేను చదువు, ఆటలు తప్ప దేనిమీదా శ్రద్ధ చూపేవాడిని కాదు. ముఖ్యంగా అమ్మాయిలన్నా, వాళ్ళతో మట్లాడాలన్నా చాలా భయపడేవాడిని. మా స్నేహితులు ఎప్పుడూ అమ్మాయిల గురించి మాట్లాడేవారు. వాళ్ళని రకరకాలుగా వర్ణించి ఏడ్పించేవారు. 36–26–36, 38–28–40 ఇట్లా ఏవేవో చెప్పుకునేవారు. ఇద్దరు, ముగ్గురైతే అమ్మాయిలతో తమకున్న అనుభవాన్ని కూడా చెప్పేవారు."

వాసు కాసేపు ఆగాడు. డాక్టర్ ఇంటరెస్టింగ్‌గా వింటున్నాడు.

"కొన్నాళ్ళు తరువాత నాకూ ఆ అనుభవం గురించి తెలుసుకోవాలనిపించింది. అందుకు ప్రయత్నం కూడా చేశాను. కానీ నా వలన ఏమీ కాలేదు. ఏదో కంగారు, భయం. ఆ అమ్మాయి గేలి చేసి పంపేసింది. నేను నిజంగానే అందుకు పనికి రానేమో అన్న భయం పట్టుకుంది. పెళ్ళయితే స్వంత భార్యే కనుక ఇటువంటి కంగారు ఉండదని మా ఫ్రెండ్స్ అనడంతో పెళ్ళి చేసుకున్నాను. కానీ ... కానీ మా వైవాహిక జీవితం మరో మలుపు తిరిగింది."

బాధతోనో ఆవేదనతోనో అతని గొంతు పూడుకుపోయింది.

"ఏం జరిగింది? పరవాలేదు చెప్పండి" డాక్టరు అడిగాడు.

వాసు ఆనాటి సంఘటనను చెప్పసాగాడు.

★ ★ ★

తెల్ల చీర, తలనిండా మల్లెపూలు, చేతిలో పాలగ్లాసు, రంగు తక్కువైనా రమ్యంగానే కనిపించింది రమ్య నా కంటికి. అందుకేనేమో 'తా వలచింది రంభ' అంటారు. నాకసలే బిడియం దానికి తోడు రమ్య పాలగ్లాసు టేబులు మీద ఫలహారాలు ప్రక్కన పెట్టి, అటు తిరిగి మంచం మీద పడుకుంది.

సిగ్గుపడుతోందేమోనని నేనే చొరవ చేసి దగ్గరకు వెళ్ళి, "రమ్యా" అని భుజం మీద చేయి

# ప్రమాణం

సోమంచి ఉషారాణి

వేశాను.

నా చేయి విసిరికొట్టి "నా కసలు పెళ్ళన్నా, మగాళ్ళన్నా అసహ్యం" అంది అసహ్యాన్నంతా తన ముఖంలో చూపిస్తూ.

"ఏమిటి రమ్యా! జోక్ చేస్తున్నావా?" అన్నాను మళ్ళీ చేయివేసి.

"నేను నిజమే చెబుతున్నాను. నన్ను ముట్టుకోవద్దు" అంది విరాగ్గా.

"ఎందుకని?" సౌమ్యంగానే అడిగాను.

"కారణం అనవసరం. నాకిష్టం లేదు. అంతే!" లేచి కూర్చుని విసురుగా అంది రమ్య.

"మరైతే పెళ్ళెందుకు చేసుకున్నావు?" ఆశ్చర్యంగా అడిగాను.

"వద్దన్నా మా వాళ్ళు నా బరువు దింపుకోవడానికి పెళ్ళి చేశారు" రెండు మోకాళ్ళ మధ్య తలపెట్టుకుని ఏడవసాగింది.

నాకు ఏం చేయాలో తోచలేదు. నాలో అసహనాన్ని అణచుకుని, వేదాంతిలా నవ్వుకుని, "పోనీలే బాధపడకు రమ్యా! నీకు ఇష్టం లేకుండా నిన్ను ముట్టుకోనులే" అని ఇటు తిరిగి పడుకున్నాడు.

రమ్య దుఃఖాన్ని దిగమ్రింగుకుని, కళ్ళు తుడుచుకుని హాయిగా నిద్రపోయింది. నాకు మాత్రం నిద్రరాలేదు.

"ఏమిటిది నాకేనా ఇలాంటి అనుభవం? అందరికీ అంతేనా? పోనీలే క్రొత్త గనుక భయపడుతోందేమో! నాలుగు రోజులైతే తనే దగ్గరకు వస్తుంది" అనుకుని నిద్రకుపక్రమించాడు.

నాలుగు రోజులు కాదు నెలరోజులైనా తన వైఖరిలో మార్పు లేదు. నాకు కావలసినవి అన్నీ అందిస్తుంది. ఇంట్లో అందరితోనూ మామూలుగానే మాట్లాడుతుంది. ఎప్పుడైనా మీద చేయి వేస్తే మాత్రం కసిరిగొడుతుంది. నాలోనూ సహనం నశించింది.

ఎంతో సరదాగా సినిమాలు, షికార్లు తిరగవలసిన మేము ముభావంగా ఉండడం ఇంట్లో వాళ్ళకి అనుమానం వచ్చింది. అమ్మ నన్ను అడగనే అడిగింది. ఉన్న విషయం చెప్పేశాను. అమ్మ ఆశ్చర్యపోయింది. ఆవేశపడింది. బాధపడింది. మా నాన్నగారితో చెప్పినట్లుంది. ఆయన మీ దగ్గరకు వెళ్ళమని సలహా ఇచ్చారు".

తాను చెప్పదలచుకున్నది చెప్పేసి దీర్ఘంగా నిట్టూర్చాడు వాసు.

"డోంట్ వర్రీ మిస్టర్ వాసూ! కొంతమందికి ఆ విషయంలో అసహ్యం, అపోహ ఏదో కారణం ఉంటుంది. అటువంటి వాళ్ళని విసుక్కొని, ఆవేశపడి వారి అపోహను పెంచక, ప్రేమతో, ఆప్యాయంతో మాట్లాడుతూ, ఆమెకు నచ్చేట్లుగా ప్రవర్తిస్తే కొంత వరకు మారవచ్చు. ఏవీహా ఆమెను ఒకసారి నా దగ్గరకు తీసుకువస్తే నేను చెప్పవలసింది చెప్పి, నా ప్రయత్నం నేను చేస్తాను. సో బెటర్ లక్!" నవ్వుతూ షేక్ హేండ్ ఇచ్చారు డా. ప్రకాష్.

వాసు ఆయన ఫీజు చెల్లించి బయటపడ్డాడు.

స్వీట్లు, పళ్ళు, పూలు కొనుక్కొని ఇంటికి వచ్చాడు.

రమ్య హుషారుగా తన బట్టలు సర్దుకుంటోంది. వాసుని చూసి. "మా అన్నయ్య పెళ్ళికి వారం రోజులు ముందే రమ్మని నాన్నగారు ఉత్తరం వ్రాశారండి. రేపే బయలుదేరుతున్నాను" అంది అడగకుండానే.

వాసు నవ్వుకున్నాడు. ఈ ఆడవాళ్ళకి పుట్టిల్లంటే ఎంత మమకారమో!" తను తెచ్చినవి ఆమె చేతిలో పెట్టాడు.

వాసు స్నానం చేసి వచ్చాక ఇద్దరూ భోజనం చేశారు. అప్పుడు కూడా ఏవో పుట్టింటి సంగతులు చెబుతూనే ఉంది రమ్య.

"నీకు పెళ్ళన్నా, మగవాళ్ళన్నా అసహ్యం కదా. మరి మీ అన్నయ్య పెళ్ళి?" ఉన్నట్టుండి అడిగాడు వాసు.

సడన్‌గా అడిగేసరికి తెల్లబోయింది రమ్య. ముందు అర్థం కాలేదు. తరువాత అర్థం చేసుకొని "నాకు నా పెళ్ళంటే ఇష్టం లేదు అన్నాను కానీ ఇతరుల పెళ్ళిళ్ళు ఇష్టం లేదనలేదే!" అంది సమర్థించుకుంటూ.

"ఐసీ! అయితే దురదృష్టవంతుణ్ణి నేనే అన్నమాట!" నిట్టూర్చాడు వాసు.

రమ్య అదేమీ పట్టనట్లు "ఇదిగో పెళ్ళికి మీరు తప్పకుండా రావాలి. ఏవంకో పెట్టి మానేశారో..." వాసు చూపు ఎక్కడ ఉందో చూసి పైట గబుక్కున సరిచేసుకుంది.

తలనిండా పూలు పెట్టుకుని, హుషారుగా మాట్లాడుతున్న రమ్యని చూస్తే వాసుకి తనని తాను కంట్రోలు చేసుకోవడం కష్టంగా ఉన్నా అన్నమాట ప్రకారం నిగ్రహంగా ఉండిపోయాడు.

స్వీటు పాకెట్ ఓపెన్ చేసి అతని నోట్లో స్వీటు పెట్టింది రమ్య. స్వీటుతోపాటు రమ్య వేలు కూడా కొరికేసరికి బుంగమూతి పెట్టింది.

వాసు చిలిపిగా నవ్వి, తనూ ఒక స్వీటు ఆమె నోటికి అందించాడు. తన వేలు కొరికాడన్న కోపమో, తనూ అతని వేలు కొరికింది రమ్య.

'అబ్బా!' గబుక్కున వేలు లాక్కుని వాసు ఊదుకుంటుంటే గల గలా నవ్వింది రమ్య. ఆమె నవ్వుతుంటే తన బాధ మర్చిపోయి ఆమెని పరవశంగా చూశాడు వాసు.

రమ్య స్వీట్ పాకెట్ మూసేసి, లైటార్పి మామూలుగా అటు తిరిగి పడుకుంది. వాసు మాత్రం ఈ రోజు తన ఆవేశాన్ని అదుపులో పెట్టుకోలేక పోతున్నాడు. అలాగని తొందరపడితే మాట తప్పడమే కాక, డాక్టరు గారు చెప్పినట్లు ఆమె అపోహని మరింత పెంచినవాడౌతాడేమో!

అతికష్టం మీద తనని తాను కంట్రోలు చేసుకుని 'నాతిగల బ్రహ్మచర్యానికి' తన దురదృష్టాన్ని తానే నిందించుకుని నిద్రలోకి జారిపోయాడు వాసు.

మర్నాడు పుట్టింటికి బయలుదేరి వెళ్ళిపోయింది రమ్య. పెళ్ళినాటికి వాసు కూడా వెళ్ళాడు తల్లిదండ్రులతో సహా.

పెళ్ళిలో ఆడపడుచుగా అధికారం చలాయిస్తూ బాగానే తిరగింది రమ్య. ఆమె ఫ్రెండ్స్ తనని, భర్తని వేళాకోళం చేసినా నవ్వేసింది. పెళ్ళి ఫోటోల్లో వీడియోలో అంతటా తానే అయింది. భర్త భుజం చుట్టూ చేయి వేసి ఫోటో దిగినా

మిగతా ౨౯వ పేజీలో

23వ పేజీ తరువాయి

కాదనలేదు కానీ కాస్త ఇబ్బందిగా ఫీలయింది రమ్య.

పెళ్ళి హడావిడి అయ్యాక అత్తారింటికి వచ్చిన రమ్య మామూలుగానే ముభావంగా ఉండడంతో ఒకరోజు డాక్టర్ ప్రకాష్ దగ్గరకి తీసుకెళ్ళాడు వాసు.

"నాకేం జబ్బులేదే! నన్ను డాక్టరు దగ్గరికి ఎందుకు తీసుకువచ్చారు?" వాసు సమాధానం చెప్పలేదు. మౌనంగా లోపలికి వచ్చారు.

డాక్టరు వాసుకి షేక్ హేండిచ్చి, "కూర్చోమ్మా! నీ పేరేంటి?" అని మొదలుపెట్టి, ఆమె చదువు, హాబీలు, తల్లిదండ్రులు, అన్నా చెల్లెళ్ళు, స్నేహితుడు అందిరి గురించి వరుసగా ప్రశ్నలు వేశాడు.

మొదట బిడియపడినా, తరువాత వాటన్నింటికీ చకచకా, హుషారుగా సమాధానాలిచ్చింది రమ్య.

"నీకు పెళ్ళంటే ఇష్టమేనా?"

"లేదు" అంతలోనే అయిష్టంగా ముఖం పెట్టింది.

"ఎందుకని?"

"ఏమో?"

"ఫరవాలేదు చెప్పమ్మా! ఎందుకిష్టం లేదు? ఏదైనా కారణం ఉండాలిగా! చదువుకున్నదానివి పైగా మంచిదానివి. చాలా బుద్ధిమంతురాలివి" రమ్యను ప్రోత్సహిస్తూ అన్నాడు డా.ప్రకాష్.

"ఏమో! నాకు భార్యా భర్తల సంబంధం అంటే ఇష్టం ఉండదు. పైగా అసహ్యం మగవాళ్ళంటే!"

"మరి మీ నాన్నగారు, అన్నయ్య, మగవాళ్ళేగా!"

"వాళ్ళు కాదు. బయట మగవాళ్ళు! పరాయి వాళ్ళు"

"నీ భర్త కూడా పరాయివాడను కుంటున్నావా?"

"నాకు ఆయన కూడా అందరి మగవాళ్ళలాగే కనిపిస్తారు"

"పోనీ మగవాళ్ళంటే ఎందుకు అసహ్యం? నిన్ను ఏమైనా అన్నారా? ఏమైనా చేశారా? వాళ్ళంటే అసహ్యమేర్పడడానికి ఏదైనా కారణం ఉండాలిగా!"

మొదట చెప్పడానికి తటపటాయించినా డా.ప్రకాష్ ప్రోద్బలంతో తన మనసులోని మాట బయటపెట్టింది రమ్య.

ఒకసారి వాళ్ళక్కా వాళ్ళింటికి వెళ్ళినప్పుడు బావగారు తాగడానికి, పేకాటకి అక్కని డబ్బులివ్వమని వేధించడం, తాగివచ్చి ఆమెని కొట్టడం, రమ్యని అనుభవించాలని ప్రయత్నించడం అన్నీ చెప్పింది.

డాక్టరు తల పంకించి, వాసుకేసి నవ్వుతూ చూశాడు. తరువాత రమ్యకి చెప్పవలసిన నాలుగు మాటలు చెప్పి, బెస్టాఫ్‌లక్ చెప్పి ఇద్దరినీ ఇంటికి పంపించారు.

రమ్య పూలు కడిగిన ముత్యంలా రమ్యంగా తయారై, ఆ రాత్రి భర్త చెంతకు వచ్చింది. వాసు మామూలుగా ఇటు తిరిగి నిద్రపోయాడు. రమ్యకి ఏం చేయ్యాలో పాలు పోలేదు.

వాసుని హత్తుకుని పడుకుని అతని మీద చేయి వేసింది. వాసుకి హాయిగా, సంతోషంగా ఉన్నా కదలలేదు.

రమ్య అతనిని తనవైపు తిప్పుకుని ముఖం మీద ముద్దులు కురిపించింది. ఇంక వాసు ఆగలేక పోయాడు.

అప్పుడు ఇక వాళ్ళకి పాలు, పళ్ళు, పూలు ఏమీ అక్కరలేదు. ఇన్నాళ్ళూ ఇద్దరూ ఎంత ఆనందాన్ని దూరం చేసుకున్నారో తెలుసుకుని, అందుకు తానే కారణమని క్షమాపణ కోరింది రమ్య. అందుకు వాసు విధించిన తీయని శిక్షలన్నీ భరించింది.

అంత హడావిడిలోనూ భర్తని తాగుడుకి, జూదానికి, దేనికీ బానిస కానని మాట తీసుకోవడం మాత్రం మర్చిపోలేదు రమ్య. మొదటి నుండి సౌమ్యుడు, బుద్ధిమంతుడూ అయిన వాసుకి ప్రమాణం చేయడం ఏమంత కష్టం కాలేదు.

మొదటిసారి ఒక వేశ్య దగ్గరికి వెళ్ళిన తన అనుభవాన్ని కూడా నవ్వుతూ చెప్పాడు వాసు. రమ్య ఆ విషయాన్ని అంత సీరియస్‌గా తీసుకోలేదు సరికదా నవ్వుతూ వాసు ముక్కుపట్టుకుని ఆడిస్తూ చిలిపిగా అంది.

"మగవాళ్ళందరూ తాము అందుకు పవిత్రులేమోనని ఇలా ప్రయత్నిస్తే శ్రీరామ చంద్రులే ఉండరు లోకంలో. అంతేకాదు. ఆడ వాళ్ళు కూడా అదే రూట్‌లో వస్తే మీరేమై పోతారో ప్చ్!" నిట్టూర్చింది.

"ఏయ్ నాటీ!" వాసు మొట్టికాయ వేస్తుంటే రమ్య కిలకిలా నవ్వింది.


అపూర్వశక్తిగల సిద్ధ ఉంగరం

1000 రూ.లు బహుమతిగా పొందండి

అన్ని పనుల విజయం మీదే

ఈ ఉంగరాన్ని ధరించినా, మీ దగ్గరుంచుకొన్నా, తప్పిపోయిన స్త్రీ పురుషులెవరినైనా సరే మీరు గుర్తించి, వారిని మీ దగ్గరకు రప్పించుకోగలరు. కోరుకున్న వివాహం, వ్యాపార లాభం, మొదటి తరగతి పరీక్షల ఉత్తీర్ణత, కోర్టు లావాదేవీల విజయం, అధికారులందరు మీ ఆధిపత్యం ఉండుట, కోరుకున్న విధంగా సంతాన లాభం, కోరుకున్న అన్ని పనుల విజయం. ఈ తాంత్రిక ఉంగరం యొక్క మహిమ తరగదు. దీనిని మీ పేరుమీద సరైన సమయం తయారు చేయబడును. వెంటనే ఆర్డరు ఇవ్వండి. మామూలు ఉంగరం ఖరీదు రూ. 51/-, ప్రత్యేకమైనది రూ. 101/-, ప్రత్యేకమైన శక్తిగలది రూ. 151/-(24 గంటల మీకు ఫలితాన్ని ఇవ్వగలదు) ఒకసారి ప్రయత్నించండి. ఇది అబద్ధమని నిరూపించినవారికి రూ. 1,000/- బహుమతి ఇవ్వబడును.

AMBIKA ASHRAM (B/93)
P.O. Maira Barith (Gaya)